# మతిమరుపోపనిషత్

భారతదేశంలో మతిమరుపు ప్రొఫెసర్లలో పీతాంబరానికి అగ్రతాంబూలం ఇవ్వాలి. క్రికెట్ ఆటకు సోబర్స్ ఎలానో, హాకీకి ధ్యాన్‌చంద్ ఎలాగో ఆబ్‌సెంట్ మైండ్‌కీ, పరధ్యానానికీ పీతాంబరం అలాంటివాడు. 'మతిమరపు మహారత్న' 'పరధ్యాన సామ్రాట్' అనే బిరుదుల్ని దొరతనంవారు ఇస్తేగిస్తే అవన్నీ పీతాంబరం కైవసం చేసుకొంటాడు.

చిన్నప్పటినుంచీ పీతాంబరం అదో రకం మనిషి. లాగుకు గుండీలు పెట్టుకోవడం మరిచిపోయి క్లాసులో ఆడపిల్లల ఎదుట కూర్చొనేవాడు. అందుకే వాళ్లు 'పోస్టాఫీస్' అని ముద్దుగా పిలిచేవాళ్ళు. చొక్కా తిరగేసుకొని, వాళ్ళ అన్నయ్య లూజు నిక్కరు వేసుకొని హడావుడిగా బడికి పరుగెత్తేవాడు. ఎప్పుడూ ఏదో తనలోతాను మాట్లాడుకొంటూ శూన్యంలో వేళ్ళు తిప్పుతూ వుండేవాడు.

ఈ లోకం మనిషి కానట్టే ప్రవర్తన వుంటూ వచ్చింది. అట్లని ఆధ్యాత్మికుడా అంటే కాదు. అమాయకుడనీ గట్టిగా చెప్పలేదు. అటు దద్దమ్మా కాదు ఇటు అసమర్థుడూ కాదు. ఒక్క చదువు విషయంలో తప్ప మిగతా వాటిల్లో ఉత్సుకత చూపించేవాడు కాదు. శారీరకంగా కాని, మానసికంగాకాని ఏ లోటు పాట్లు లేవనీ ఈ అసాధారణ ప్రవర్తన బహుశ తాతల నుంచి సంక్రమించి వుంటుందని తేల్చి చెప్పారు డాక్టర్లు అరడజనుమంది.

కట్నం కానుకలకు ఆశించకుండా కుందనపు బొమ్మలాంటిదాన్ని ఏరికోరి ముడిపెట్టారు అట్లయినా దారికొస్తాడేమోనని. వారి అంచనాలన్నీ తల్లక్రిందులయ్యాయి. అతడిలో ఏ థ్రిల్లూ లేదు. ఇక వీడిగతి యింతే అనుకొన్నారు తల్లిదండ్రులు వగైరా.

తన తలరాతకు భార్య లబలబలాడింది. కాలక్రమేణా అలవాటుపడి రాజీ పెట్టుకొంది. మొగుడ్నే గొప్ప హీరోగా అనుకొని పసిపాపని పెంచినట్టుగా అన్నీ చేస్తూ వచ్చింది. తెల్లారింది నిద్ర లేవండి. పళ్ళు తోముకోండి. కాఫీ తాగండి.... స్నానం చేయండి....అన్నం తినండి.... చొక్కా వేసుకోండి....సిగరెట్టు కాల్చండి కాలేజీకి వెళ్ళండి....ఇలా అనేవి ఆమె నిత్యమూ చదివే వేదం. భార్య కొన్ని విషయాల్లో తెగించి చొరవ తీసుకోకపోతే ఆమె జీవితం మరీ దుర్భరమై వుండేది.

"ఈ వేళ లంచ్‌కు రాలేదేమండీ" అంది భార్య. "అదేమిటీ నేను యింటికొచ్చి తినిపోలేదా....ఐ....సీ అవునవును




నీ వంటే గుర్తుకొస్తోంది, లేబరేటరీలో ఏవో ప్రయోగాలు చేస్తూ తిండి మాటే మరిచిపోయా. సరిగ్గా ఒంటిగంటకు కిల్లీ నములూ సిగరెట్ కాల్చా భోజనం చేశా ననుకొని'' అన్నాడు పీతాంబరం.

''ఇంకానయం. పెళ్ళి అయిందని మర్చిపోయి దేన్నైనా ప్రేమించేరు సుమా'' అంది నవ్వేస్తూ.

ఒకసారి ఇద్దరూ సినిమాకెళ్ళారు. ఇంటర్‌వెల్‌లో పీతాంబరం బయట కొచ్చాడు. సినిమా ఐపోవొచ్చినా తిరిగి హాల్లోకి రాలేదు. ఆట వదిలారు. భార్య వెతుక్కుంటూ ఒంటరిగా ఇంటి కొచ్చింది.

పీతాంబరం ఓ బండెడు పుస్తకాలు ముందేసుకొని బుద్ధిమంతుడైన విద్యార్థిలా వాటితో సాధన చేస్తూ కనుపించాడు.

''అదేమిటండీ. నన్ను ఒక్కత్తెనే వదిలి వచ్చేశారేం'' అంది ఆమె

''అరెరె! సినిమాకు మనిద్దరం పోయామా! మర్చే పేరంటానికి వెళ్ళా వను కొన్నా. సినిమా బోర్‌గా వుంటే ఇంటి కొచ్చేశా'' అన్నాడు పీతాంబరం

భూతద్దాల్లాంటి కళ్ళలోంచి విచిత్రంగా చూస్తూ.

"వా బదులు దేన్నో ఒకదాని పెళ్ళాం అనుకొని యింటికి తీసుకరాకుండా ఒక్కరే వచ్చారు అందుకు సంతోషం" అంది.

పీతాంబరం భార్య అర్జెంటుగా పుట్టింటికి వెళ్ళే పనివచ్చింది. కనీసం వారం రోజులైనా వుండాలి. అందుకామె ఎన్నో ప్రణాళికల్ని తయారుచేసింది. మరెన్నో వ్యూహాల్ని అల్లింది. పని మనిషికి ఏమేమి చేయాలో ఎలా చేయాలో ఒక రోజంతా నూరి పోసింది. దానిచేత ఆ పనులన్నీ రెండు మూడు సార్లు ఏ కరువు పెట్టించుకొని రిహార్సల్సు చేయించింది.

"అప్పలమ్మా అయ్యగార్ని కంటికి రెప్పలా కాపాడే భారంనీది. వచ్చి నీ కడుపున పుడతానే. వూరినుంచి రాగానే ఓ మంచి చీర యిస్తా. మీ బుడ్డోడికి చొక్కా కుటిస్తా. మీ అయనకు బాబుగారి పాత గుడ్డలిస్తా నే వచ్చేటప్పుడు ఆవకాయ తేస్తా నీ కోసం కాస్త ఎక్కువే తెస్తా. మీ దొరగారు ఎంతో అమాయు మనిషి. వొంటిమీద స్పృహ వుండదు. జాగ్రత్తగా అన్నీ చూసుకొవే ఏదీ మర్చిపో వొద్దు. నేను లేని లోటు ఏ మాత్రం రానీయకు తెలసిందా ఏం ?గా వాగుతున్నానంటే నా అదుర్దా అర్థం చేసుకొవే" అంది గుక్క తిప్పుకోకుండా చెప్తూ.

"మీరింతగా చెప్పాలమ్మా? బాబుగోరి యావరం నాకింతా ఎరికే తమరు లేని లోటు వచ్చినా రానీను మీరు బేఫికరుగా ఎల్లిరాండి. అంతానే చూసు కొంటాగా" అంది భరోసా యిస్తూ.

ముక్కోటి దేవతలకు ముడుపు కట్టి తన వంచ ప్రాణాల్ని భర్తదగ్గరే అట్టే పెట్టి ఉత్తకట్టెతో మాత్రమే ఆమె రైలెక్కింది. వారం రోజులు వెయ్యి యుగాలుగా గడిపి తిరిగి వచ్చింది. భర్త ఎప్పటిలానే వున్నాడు. చిక్కి పోలేదు. బెంగ పడ్డట్టు కనుపించలేదు. తను చెప్పనవన్నీ అప్పలమ్మ తు.చ. తప్పకుండా అచరణలో పెట్టివుంటుందని సంతోష పడింది.

"పోయినప్పటి నుంచీ మీదేబెంగా కంటికి కునుకే పడలేదా. మీదే ధ్యాస. ఈ వారం రోజులు ఎంత భారంగా గడిచాయొ ఆ పరమాత్ముడికే తెలుసు. అన్నట్టు....మీకే ఇబ్బందీ లేకుండా అన్నీ సవ్యంగా జరిగి పోయాయా. పనిమనిషి అన్నీ సరిగ్గా చూపిందా" అంది భర్తతో.

"ఏ పని మనిషి?....ఇన్నాళ్ళూ నువ్వు లేవూ? ఓ....హో మర్చేపోయా వూరికేదో వెడతనన్నావు కదూ: అయితే వెళ్ళి వచ్చావన్నమాట. అంతా కులాసాయేనా. మరి....మరి రాత్రిళ్ళు పక్కలో పడుకొని కులాసాగా కబుర్లు చెప్పి కాలక్షేపం చేసింది. నువ్వుకాదన్న మాట!" అన్నాడు అమాయకంగా.